నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, ఆదివారం 20 అక్టోబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

రైతుబంధుపై రిక్త'హస్తం'

వానకాలం ముగిసినా రైతుల ఖాతాల్లో జమకాని నగదు
ఇటు ప్రకృతి వైపరీత్యాలు.. అటు అందని 'భరోసా'తో సతమతం
సర్కార్ తీరుపై నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో నిరసనలు



ఖమ్మం, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వానకాలం ముగిసినా రైతుబంధు జాడ కరువైంది. రైతులు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసినా కాంగ్రెస్ ప్రభుత్వం నయా పైసా విదల్చలేదు. యాసంగి వచ్చినా డబ్బులు జమ చేయకపోవడంతో జిల్లావ్యాప్తంగా సుమారు 3.10 లక్షల మంది సాగు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. అప్పులు తెచ్చి పంటలు సాగు చేసిన రైతులు వాటికి వడ్డీలు కట్టలేక తంటాలు పడుతున్నా ప్రభుత్వం మాత్రం రైతన్నలపై కనికరం చూపడం లేదు. బీఆర్ఎస్ అధినేత, గత ముఖ్యమంత్రి కేసీఆర్.. అప్పుల ఊబిలో చిక్కుకున్న రైతులను ఆదుకోవాలని, భవిష్యత్‌లో రైతులు అప్పుల జోలికి వెళ్లొద్దనే ఉద్దేశంతో 2018లో రైతు బంధు(పంటల పెట్టుబడి) పథకాన్ని తీసుకొచ్చారు. పథకం కింద తొలి రెండేళ్లలో ఎకరానికి రెండు సీజన్లకు కలిపి రూ.8వేల చొప్పున రైతుల ఖాతాల్లో డీబీటీ రూపంలో జమ చేశారు. తర్వాత సాగుకు పెట్టుబడి పెరుగుతున్న నేపథ్యంలో 2020 సంవత్సరం నుంచి మరో.2 వేలు పెంచి.. ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పకడ్బందీగా పథకం అమలు కావడంతో పొరుగు రాష్ట్రాలు సైతం ఈ పథకంపై అధ్యయనం చేశాయి. చివరికి కేంద్ర ప్రభుత్వం సైతం 'పీఎం కిసాన్' పేరుతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన సందర్భం ఉంది.

కరువైన 'భరోసా'..

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే 'రైతు భరోసా' పేరుతో ఎకరానికి రూ.15 వేల చొప్పున అందజేస్తామని రైతులకు హామీ ఇచ్చింది. తీరా అధికారం చేపట్టిన తర్వాత నాటి నుంచి రైతు భరోసా అమలును వాయిదాల పేరుతో కాలయాపన చేస్తూ వస్తున్నది. ఈ క్రమంలో వానకాలం ముగిసి.. యాసంగి వచ్చినా రైతు భరోసా అమలు మాత్రం ఏకోశాన కనిపించడం లేదు. సర్కార్ నుంచి ఏమాత్రం సాయం అందకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై కర్షకులు మండిపడుతున్నారు. నమ్మించి నట్టేట ముంచారని వాపోతున్నారు.

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసనలు

రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కాంగ్రెస్ సర్కార్ తీరుపై, ఆపదలో ఉన్న రైతులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు రుణమాఫీ ఇప్పట్లో చేయలేమని చెప్పడంతో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్ నాయకులు.. రైతులు, రైతు సంఘం నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నారు. నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలతోపాటు పార్టీ ముఖ్య నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, రైతు సమన్వయ కమిటీ మాజీ బాధ్యులు, రైతు సంఘాల నాయకులు పాల్గొననున్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, పక్కన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు వనమా, మెచ్చా, హరిప్రియా నాయక్, తాటి వెంకటేశ్వర్లు

- 'సీతారామ' నీళ్లు నెత్తిన చల్లుకున్నారుగానీ.. రైతులకు సాగు నీరేది?
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా సమావేశంలో మాజీ మంత్రి అజయ్
- ఢిల్లీకి మూటలు మోసేందుకే కాంగ్రెస్ నేతలు: మాజీ ఎమ్మెల్యే రేగా
- ఉగాది తర్వాత పార్టీకి పూర్వవైభవం: ఎమ్మెల్సీ తాతా మధు
- పార్టీ జిల్లా కార్యాలయంలో ఫుల్ జోష్‌తో కార్యకర్తల సమావేశం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు వనమా, మెచ్చా, హరిప్రియ, తాటి

300 రోజుల పాలనలో.. 3 హామీలకూ గతిలేదు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : అధికారంలోకొచ్చి 300 రోజులైనా మూడు హామీలను కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేకపోయిందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. రైతుభరోసా కింద పంటలకు పెట్టుబడి సాయం ఇవ్వలేకనే కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన శనివారం ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా కార్యకర్తల సమావేశంలో అజయ్ మాట్లాడారు. ఉత్తుత్తి హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు.. రైతులకు ఇప్పటి వరకూ రైతుభరోసా ఇవ్వకుండా వారిని దగా చేసిందని ఆరోపించారు. రుణమాఫీపై గప్పాలు కొట్టిన రేవంత్ ప్రభుత్వం.. చివరికి సగం మంది రైతులకు కూడా మాఫీ చెయ్యలేదని దుయ్యబట్టారు. దీంతో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాద్రి జిల్లాలో గత సీఎం కేసీఆర్ నిర్మించిన సీతారామ ప్రాజెక్టును ఇప్పటి సీఎం ఓపెన్ చేసి నీళ్లు చల్లుకున్నారు గానీ రైతులకు మాత్రం సాగునీరు ఇవ్వలేకపోయారని విమర్శించారు. ఆడబిడ్డలకు రూ.లక్ష కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం ఇస్తామన్న ఈ సర్కారు.. నేటికీ దానిని ఇవ్వలేక చతికిలబడిందని ఆరోపించారు. ఇప్పటి వరకు లక్ష వివాహాలు జరిగాయని, ఆ లక్ష మంది ఆడబిడ్డలకు రూ.లక్ష చొప్పున కల్యాణలక్ష్మి సాయం అందించకపోగా.. వారికి లక్ష తులాల బంగారం బాకీ పడ్డారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ కప్పదాటే వైఖరిని ఎండగట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, బానోతు హరిప్రియ, తాటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, నాయకులు దిండిగాల రాజేందర్, రావుల పల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫుల్ జోష్..

కాగా, సమావేశమంతా కార్యకర్తల జోష్‌తో కన్పించింది. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరు కావడంతో నాయకుల్లో ఎనలేని ఉత్సాహం నిండింది. పోస్టాఫీస్ సెంటర్ నుంచి పార్టీ కార్యాలయం వరకూ వనమా టీం బైక్ ర్యాలీ ద్వారా సమావేశానికి హాజరైంది.

ఢిల్లీకి మూటలు మోసేందుకే కాంగ్రెస్ నేతలు: రేగా

ఢిల్లీకి మూటలు మోసేందుకే రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు సమయం సరిపోతోందని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు. ఇక వారు ప్రజా సమస్యలను ఎప్పుడు పట్టించుకుంటారని ఎద్దేవా చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే గెలుస్తారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ సత్తాను చాటుతారని అన్నారు. వచ్చే నెల నుంచి జిల్లా అంతటా పార్టీ సమావేశాలు జరుగుతాయన్నారు. ఇక నుంచి పార్టీలోకి ఎవరినీ తీసుకోబోమని అన్నారు. భద్రాచలం అసెంబ్లీ స్థానానికి త్వరలో ఉప ఎన్నిక జరుగుతుందని, అక్కడ మన అభ్యర్థి భారీ మెజారిటీతో గెలవబోతున్నారని తేల్చిచెప్పారు.

ఉగాది తర్వాత పూర్వవైభవం: తాతా మధు

ఉగాది తర్వాత బీఆర్ఎస్‌కు పూర్వవైభవం రాబోతోందని ఎమ్మెల్సీ తాతా మధు స్పష్టం చేశారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా బీఆర్ఎస్ శ్రేణులు భయపడబోవని స్పష్టం చేశారు. గతంలో ఎప్పుడూ అధికారులు ప్రజాప్రతినిధుల కాళ్లు పట్టుకోలేదని గుర్తు చేశారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అలా జరుగుతోందని ఆరోపించారు.

తేడాను ప్రజలు గమనిస్తున్నారు: వనమా

గత కేసీఆర్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనిస్తున్నారని కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్‌వన్నీ 420 హామీలేనని, వాటితోనే ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రా? జోకరా?: రాకేశ్‌రెడ్డి

ఇప్పుడున్న ముఖ్యమంత్రి జోకర్‌లా వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి విమర్శించారు. క్యాబినెట్ అంతా జబర్దస్త్ టీంలా తయారైందని ధ్వజమెత్తారు. భద్రాచలంలో రాముడు ధర్మంగా నడిచాడని, కానీ.. భద్రాచలంలో బీఆర్ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే మాత్రం అధర్మంగా నడుస్తున్నాడని ఆరోపించారు.

సమావేశానికి హాజరైన కార్యకర్తలు

కఠిన శిక్షలు విధిస్తున్నా ఆగని లైంగిక దాడులు

భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెం టౌన్, అక్టోబర్ 19 : బాలికలపై లైంగిక దాడులకు పాల్పడుతున్న నిందితులకు న్యాయస్థానాలు కఠిన శిక్షలు విధిస్తున్నా దాడులు ఆగడం లేదని, పోక్సో చట్టం కూడా దీనిని నిరోధించలేకపోతున్నదని భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆలిండియా లాయర్స్ యూనియన్, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్వహించిన న్యాయవాద వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన మేజర్ చట్టాల అమలులో సందేహాలు తలెత్తుతున్నాయని, వాటిని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎంవీ ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు, బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ, బార్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్ మక్కడ్, ఐలూ జాతీయ కౌన్సిల్ మెంబర్ శివరాం ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, పురుషోత్తంరావు, అన్నపూర్ణ, సుడిగాలి వెంకట నర్సయ్య, బండారు అరుణ్ చంద్, మేదరమెట్ల శ్రీనివాసరావు, ఉడతనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేవోసీ ఎదుట భూ నిర్వాసితుల ధర్నా

హైకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్

కేవోసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న భూ నిర్వాసితులు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

టేకులపల్లి, అక్టోబర్ 19 : కోయగూడెం ఉపరితల గని పరిధిలో భూములు కోల్పోయిన నిర్వాసితుల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సింగరేణి యాజమాన్యం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వాసితులు కేవోసీ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. తొలుత భూ నిర్వాసితులకు భూమికి బదులు భూమి, నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ కిష్టారం, లచ్చగూడెం, కోయగూడెం, దంతెలతండా, కొత్తతండా, జేత్యతండా గిరిజనులతో కలిసి కోయగూడెం ఉపరితల గనిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ కోయగూడెం ఓసీ-2 భూ నిర్వాసితుల పదహారేళ్ల పోరాటానికి ఫలితమే హైకోర్టు తీర్పు అని, దానిని సింగరేణి యాజమాన్యం కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈసం నరసింహారావు, పూన్నెం చంద్రశేఖర్, దొడ్డ కోటేశ్వరరావు, సమ్మయ్య, చుక్కమ్మ, బోడ కృష్ణ, బానోత్ రామ, కోరం సుభాష్‌చంద్రబోస్, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

పథకాల అమలు బాధ్యత అధికారులదే..

- గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలి
- దిశ కమిటీ సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్

దిశ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు బాధ్యత అధికారులదేనని, వాటిని అర్హులైన గిరిజనులకు అందేలా చూడాలని దిశ కమిటీ చైర్మన్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశాన్ని శనివారం నిర్వహించారు. శాఖల వారీగా పూర్తి చేసిన, నిర్మాణ దశలో ఉన్న, ఇతర అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువనున్న ప్రతి పేద, ఆదివాసీ గిరిజన గ్రామాల్లోని గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. పేదరిక నిర్మూలన, నిరక్షరాస్యత, బాల్య వివాహాలు, బాలల హక్కులు, బాల కార్మిక వ్యవస్థలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. నియోజకవర్గాల్లోని మారుమూల ప్రాంతాల్లో విద్యుత్, తాగునీరు, రోడ్ల సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఉన్నత, గిరిజన సంక్షేమ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, మాతా, శిశు సంరక్షణ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు, సౌకర్యాలు కల్పించాలని, వీటిని కలెక్టర్, ఐటీడీఏ పీవోలు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని చెప్పారు. అనంతరం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడారు. సమావేశంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, అదపు కలెక్టర్ వేణుగోపాల్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, మాలోత్ రాందాస్‌నాయక్, జారే ఆదినారాయణ, దిశ కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వ్యాపార విస్తరణలో 'సింగరేణి'

ఆస్ట్రేలియా మైనింగ్ టెక్నాలజీ కంపెనీ ప్రతినిధుల భేటీలో డైరెక్టర్(పా) వెంకటేశ్వర్‌రెడ్డి

మాట్లాడుతున్న డైరెక్టర్(పా) వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 19 : సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితోపాటు థర్మల్, సోలార్ రంగాల్లోకి అడుగుపెట్టి విజయ పరంపరను కొనసాగిస్తున్నదని డైరెక్టర్(పా) వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు అవసరమైన ఆధునిక మైనింగ్ టెక్నాలజీ, శాస్త్ర, సాంకేతిక విషయాల్లో సహకారం అందించే విషయంలో ఆస్ట్రేలియా దేశ న్యూ సౌత్ వేల్స్ రాష్ట్ర మైనింగ్ టెక్నాలజీ కంపెనీ సభ్యుల బృందం కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయంలో శనివారం సంస్థ డైరెక్టర్(పా), సంబంధిత జీఎంలతో సమావేశమైంది. ఈ సందర్భంగా డైరెక్టర్(పా) మాట్లాడుతూ వ్యాపార రంగాన్ని మరింతగా విస్తరించేందుకు ఇతర రంగాల్లోని అవకాశాలను పూర్తిస్థాయిలో పరిశీలిస్తున్నట్లు చెప్పారు. అనంతరం తమ తమ కంపెనీల మైనింగ్, రక్షణ, సాంకేతిక టెక్నాలజీ, యంత్రాల వినియోగం, బొగ్గు ఉత్పత్తిలో వాటి పనితీరు గురించి ఆస్ట్రేలియా కంపెనీ ప్రతినిధులు వివరించారు. సమావేశంలో జీఎంలు మనోహర్, సూర్యనారాయణరాజు, సాయిబాబు, రఘురాంరెడ్డి, రాంకుమార్‌రావు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్
- కిన్నెరసానిలో ముగిసిన ఐటీడీఏ జోనల్ స్థాయి క్రీడలు
- రాష్ట్రస్థాయి పోటీలకు 240 మంది క్రీడాకారుల ఎంపిక

ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న పీవో రాహుల్

పాల్వంచ రూరల్, అక్టోబర్ 19 : విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసే బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులదేనని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. ఐటీడీఏ పరిధి ఎనిమిది జోన్లలోని గిరిజన పాఠశాలల విద్యార్థులకు కిన్నెరసాని స్పోర్ట్స్ స్కూల్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి పీవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తాము ఎంచుకున్న క్రీడాంశంలో రాణించేందుకు వ్యాయామ ఉపాధ్యాయుల వద్ద మెళకువలు నేర్చుకొని వాటిని నిత్యం సాధన చేయాలన్నారు. రెండు రోజులపాటు వివిధ క్రీడాంశాల్లో 800 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, వీరికి ఎనిమిది అంశాల్లో పోటీలు నిర్వహించి 240 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారని తెలిపారు. కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, డీడీ మణెమ్మ, రమణయ్య, ఏటీడీవోలు జహీరుద్దీన్, అశోక్‌కుమార్, అనురాధ, చంద్రమోహన్, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, ఏఎస్‌వో వెంకటనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు బుగ్గ వెంకటేశ్వర్లు, నగేష్, సుబ్రహ్మణ్యం, మోతీలాల్, రామారావు, రాంబాబు, పత్యూష, శిరోమణి పాల్గొన్నారు.